## మంచిమాట

బాధ కలిగినా, సంతోషం కలిగినా
మనల్ని మనం కౌగిలించుకోలేం,
మన భుజాలమీదపడి మనం
ఏడవనూలేం. ఏ ఫీలింగ్స్‌కి అయినా
'మన' అనేవారు ఉండాలి.
అందుకే ఆత్మీయుల్ని ఎప్పుడూ
దూరం చేసుకోకూడదు.


# DD9 వార్త

తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com

సంపుటి : 01 సంచిక : 142 గురువారం, 08, 2026 , పేజీలు - 06 వెల : 3/-


# నాడు ఇందిరమ్మ ధైర్యం నేడు మోదీ భయం

**న్యూ ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవడానికి "సార్, ప్లీజ్ నేను మిమ్మల్ని చూడొచ్చా" అని బతిమాలినట్లుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మా ట్లాడటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "తేడా గమనించండి సార్ జీ!" అంటూ మోదీని ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధిం చారు. నాడు అమెరికా బెదిరింపులకు ఏమాత్రం భయపడని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎక్కడ నేడు అమెరికా అధ్యక్షుడి ముందు చేతులు కట్టుకు నిల్చున్న నరేంద్ర మోదీ ఎక్కడ అంటూ రాహుల్ ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆయన ఒక పాత వీడియోను షేర్ చేసి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ట్రంప్ ఏమన్నారంటే? అసలు ఈ వివాదానికి కారణం మంగళవారం ట్రంప్ చేసిన వ్యాఖ్యలే. హౌస్ జీఓపీ రిట్రీట్‌లో ట్రంప్ మాట్లాడుతూ, భారత్‌పై, మోదీపై సంచలన కామెంట్స్ చేశారు.

## చైనా, రష్యాల, క్యూబాలతో దోస్తీ కట్ చేసుకో...

**వెనిజువెలా కొత్త అధ్యక్షురాలుకు ట్రంప్ హెచ్చరికలు**

**కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా**



2లో

## ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

**అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి**

**విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య**


2లో



## సిఎం కప్ క్రీడల పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి 07 :** సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, సోనీబాల తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామస్థాయి, 28 నుంచి31 వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.

# ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు ?

**అధికారులను సన్నద్ధం చేసిన కమిషనర్**

**కలెక్టర్లు, అఅధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

**ఓటర్ల జాబితాల సవరణ, అభ్యంతరాలపై షెడ్యూల్**

**ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశం**



**హైదరాబాద్,జనవరి 07 :** తెలంగాణలో ఇటీవలే గ్రామ పంచాయతీ ఎన్నికలు సమమర్థంగా నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. తాజాగా మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కసరత్తు చేస్తోంది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్

మిగతా2లో...



## సంక్రాంతి సందర్భంగా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

**అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్**

**ప్రపంచ పర్యాటకంగా తెలంగాణ అభివృద్ధి**

**అధికారులతో కలసి సమీక్షించిన మంత్రి జూపల్లి**

**హైదరాబాద్,జనవరి 07 :** ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు

మిగతా2లో...

## గిరిజన సంక్షేమానికి కృషి

**ఎప్పుడూ లేనంతగా నిధుల కేటయింపు**

**రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన సీతక్క**


**ములుగు,జనవరి 07 :** గిరిజనలు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, గతంలో ఎప్పుడూ లేని విధంగా రేవంత్ నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పాటుపడుతోందని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి

మిగతా2లో...



## ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పరిశీలకులు

**- పుదుచ్చేరి, తమిళనాడుకు ఉత్తమ్ నియామకం**



**న్యూఢిల్లీ,జనవరి 07 :** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు సీనియర్ పరిశీలకులను ఏఐసీసీ బుధవారం నాడు నియమించింది. అస్సాం, కేరళ, తమిళ నాడు -పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌కు ఈ పరిశీలకులను నియమించింది. ఈ నియమ కాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల

మిగతా2లో...

## ఐ బొమ్మ రవికి కోర్టులో చుక్కెదురు

**- ఐదు కేసుల్లో బెయిల్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు**




**హైదరాబాద్,జనవరి 07 :** పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అతడి బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే దేశం దాటి వెళ్లిపోయే అవకాశం ఉందని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

మిగతా2లో...



## ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు

- **ముగ్గురు మంత్రులు ఉన్నా ఒరిగిందేమీ లేదు**
- **బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్**

**ఖమ్మం,జనవరి 07 :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శిం చారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. నాడు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కేసీఆర్‌గారు సీతారామసాగర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టి 90 శాతం పనులను పూర్తిచేశారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించా లని, గోదావరి జలాలపై పూర్తి హక్కులు ఖమ్మం జిల్లాకే దక్కాలని నాడు కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు

మిగతా2లో...

## మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని ఆదరించండి

**- కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి**



**హైదరాబాద్,జనవరి 07 :** బిజెపితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని, డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లనే రాష్ట్రం పురోగమ నిస్తుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. నరేంద్రమోడీ నాయకత్వంలో భారత్ ఉజ్వలంగా ఉందన్నారు. తెలంగాణలో కూడా భవిష్యత్ బాగుండాలని కోరుకుంటు న్నామని అన్నారు. జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో భాజపాకు అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయ న హామీ ఇచ్చారు. ఇటీవలి పంచాయితీ ఎన్నికల్లో పలుచోట్ల బిజెపి బలం చాటింద న్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ బిజెపిని ఆశీర్వదించాలన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో నిర్మించనున్న సింథటిక్ ట్రాక్ స్థలాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ పరిశీలించారు. స్థల విషయమై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీతో సమీక్షించారు. అనంతరం

మిగతా2లో...

# ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు ?

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, టైమ్‌లైన్స్‌పై కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. అందుకోసం బుధవారం జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధిరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఃరాష్ట్ర వ్యాప్తంగా గతేడాది డిసెంబర్‌లో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవంతంగా నిర్వహించింది. తాజాగా.. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టింది. అందుకోసం జిల్లా, మున్సిపల్ ఉన్నతాధికారులతో ఎస్ఈసీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని ఒక చర్చ సైతం సాగుతోంది. ఈ క్రమంలో తాజా ఆదేశాల మేరకు జనవరి 12లోగా ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఈ సందర్భంగా ఆయా అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. అలాగే జనవరి 13న టీ పోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఇక.. జనవరి 16న పోలింగ్ స్టేషన్ల వారీగా.. ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని సూచించింది. బ్యాలెట్ బాక్సులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎస్ఈసీ ఆదేశించింది. ఇక 2019 నాటి ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టం చేసింది. పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలన చేయాలని సూచించింది. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు, మార్పులకు అవకాశమిచ్చిందని వివరించింది. ఎఫ్ఎస్‌టీ, ఎస్-ఎస్‌టీ బృందాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని జారీచేసిన ఆదేశాల్లో ఎస్ఈసీ స్పష్టం చేసింది. జనవరి 12 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, 13 వరకు అభ్యంతరాల పరిశీలన ప్రారంభం, 16న ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదేశం ఇచ్చారు. సమావేశంలో భాగంగా కలెక్టర్లకు ముఖ్యంగా ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాల ప్రచురణపై డెడ్‌లైన్లు నిర్దేశించారు. జనవరి 12వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబితాను తప్పనిసరిగా ప్రచురించాలని ఈసీ ఆదేశించింది. 13వ తేదీ నాటికి పోలింగ్ స్టేషన్ల వివరాలతో కూడిన ముసాయిదా జాబితాను విడుదల చేసి, వెంటనే టీ పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇక, జనవరి 16వ తేదీ లోపు పోలింగ్ స్టేషన్ల పూర్తి వివరాలతో పాటు ఫోటోలతో కూడిన తుది జాబితా, తుది ఓటర్ల జాబితాను వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ చర్య ద్వారా ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, వివరాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులపై కూడా ఈసీ కలెక్టర్లకు దిశానిర్దేశర చేసింది. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్/సర్వైలెన్స్ స్క్వాడ్స్ను నియమించి, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని కమిషన్ సూచించింది. మరోవైపు, ఎన్నికల ఏర్పాట్లు పారదర్శకంగా, సమయపాలనతో జరిగితేనే ప్రజాస్వామ్య ప్రక్రియ బలోపేతమవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. కలెక్టర్లు ఈ డెడ్‌లైన్లను కచ్చితంగా పాటిస్తూ, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. అయితే, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాలు ఎన్నికల వేళ కీలకంగా మారనున్నాయి. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరగాలనే లక్ష్యంతోనే ఈ ఆదేశాలుజారీచేసినట్లు కమిషన్ వర్గాలు వెల్లడించాయి.

# సంక్రాంతి సందర్భంగా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పర్యాటకం అంటే కేవలం వినోదం కాదు, ఇది రాష్ట్ర ఆర్థిక రంగానికి చుక్కాని. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిస్తూ రెవెన్యూను, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంది. పర్యాటకం ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రంగాలను ప్రభావితం చేస్తుంది. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవకాశమిస్తుంది. ప్రపంచాన్ని కొత్తగా చూడటం ఎలాగో నేర్పుతుంది. హోటళ్లు, రవాణా, రిటైల్ షాపులు దీనివల్ల భారీగా లబ్ది పొందుతాయి. అంతేకాదు.'క్రాస్ కల్చరల్ ఇంటరాక్షన్'- అంటే వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, నేపథ్యాలు ఉన్నవారి మధ్య బంధం బలపడేలా చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసే రహదారులు, ఎయిర్‌పోర్టులు, తాగునీరు, పారిశుద్ధ్య సేవల అభివృద్ధి స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. నూతన పర్యాటక విధానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త సమతుల్య అభివృద్ధి కోసం 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను గుర్తించాం అని జూపల్లి అన్నారు. టూరిజం కాంక్లేవ్, గ్లోబల్ సమ్మిట్ ద్వారా 22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా సుమారు 90,000 ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో 19.44 మీటర్ల అతిపెద్ద బతుకమ్మ, 1,354 మంది మహిళలతో నృత్యం ద్వారా రెండు గిన్నిస్ రికార్డులు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశామన్నారు. మిస్ వరల్డ్ వేడుకలు, గ్లోబల్ సమ్మిట్‌ల నిర్వహణతో తెలంగాణ పెట్టుబడులకే కాదు, వ్యాపారానికి, పర్యటనకు అత్యంత 'సురక్షితమైన రాష్ట్రం' అని నిరూపించాం అన్నారు. మన పండుగలు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ సంక్రాంతికి 'అతిథి దేవోభవ' అనే ఆత్మీయ సంస్కారంతో ఆతిథ్య రంగం సిద్ధంగా ఉందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఉత్సవంలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, కంబోడియా, థాయిలాండ్, కొరియా, జపాన్, పోర్చుగల్, వియత్నాం, మలేషియా, ఇటలీ, స్విట్జర్లాండ్, అల్జీరియా, సింగపూర్, రష్యా, ఉక్రెయిన్ / ఫ్రాన్స్ వంటి 19 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అలాగే భారతదేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారు. రాత్రి వేళ ఆకాశంలో వెలుగులు విరజిమ్మే 'నైట్ ఫ్లయింగ్'కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ కానుందని అన్నారు. తెలంగాణ స్థానిక సంస్కృతిని ప్రోత్సహించేలా రాష్ట్ర సాంప్రదాయ కళా రూపాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వేదిక వద్ద సుమారు 100 చేనేత, హస్తకళల స్టాల్స్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రుచులతో కూడిన 60 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ సహకారంతో జరిగే ఈ ఉత్సవంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చి హైదరాబాద్ లో స్థిరపడిన వారు తమ ఇళ్లలో తయారు చేసిన 1,200 కంటే ఎక్కువ రకాల మిఠాయిలనుప్రదర్శిస్తారని అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జనవరి 16 నుండి 18 వరకు నిర్వహించబడుతుందన్నారు. ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన. ఉదయం పూట హైదరాబాద్ శివార్లలో, సాయంత్రం వేళ పరేడ్ గ్రౌండ్స్‌లో 'నైట్ గ్లో బెలూన్స్' ప్రదర్శన ఉంటుందన్నారు. జనవరి 16 / 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలోఅత్యాధునిక డ్రోన్లు, మల్టీ-కలర్ ఎఇడి లైట్లు, గగనతల విన్యాసాలతో ఈ షో సాగనుంది. ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వం నుండి ఆధునిక ఆవిష్కరణల వరకు సాగిన ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. హైదరాబాద్ - సోమశిల - శ్రీశైలం సర్క్యూట్‌లో పూర్తిస్థాయి హెలీ టూరిజం సేవలు అందుబాటులోకి వస్తాయి. నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ ప్రాంతాలను ప్రపంచ స్థాయి వెడ్డింగ్ డెస్టినేషన్లుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా మార్చడానికి ప్రత్యేక సొసైటీ స్థాపన చేస్తున్నామని అన్నారు. పర్యాటకుల భద్రత కోసం 'టూరిస్ట్ పోలీస్' అందుబాటులోకి వస్తుందన్నారు. పర్యాటకం అంటే కేవలం సందర్శన కాదు, అది ఒక అనుభూతి. అది మనల్ని మూసధోరణుల నుంచి బయటపడేలా చేసి, మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదపడుతుంది. వారసత్వ కట్టడాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ మా ప్రభుత్వ బాధ్యత.

మన పర్యాటకానికి యువత, టెక్కీలు, మీడియా, సెలబ్రిటీలు మరియు ఇన్ఫ్లుయెన్సర్లు రాయబారులుగా మారి... 'తెలంగాణ జరూర్ ఆనా' అంటే తెలంగాణకు తప్పక రండి అనే ఆత్మీయ పిలుపును ప్రపంచానికి చాటాలని కోరుతున్నట్లు వెల్లడించారు.

# గిరిజన సంక్షేమానికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, స్థానిక డీడీ దబ్బకట్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఆదివాసీల ఆత్మగౌరవం, అస్తిత్వానికి ప్రతీకగా మేడారం జాతర రూపుదిద్దుకుంటుందని, జాతర పవిత్రతను కాపాడాలని మంత్రి సీతక్క సూచించారు. పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకుల సమన్వయంతో జాతర విజయవంతం చేయాలన్నారు. జాతర నిర్వహణపై ఆదివాసీ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసం మేడారం జాతర కలకలాం గుర్తుండిపోయేలా ఆలయ ప్రాంగణం రూపుదిద్దుకుంటుందని వెల్లడించారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకొచ్చేటప్పుడు ఆదివాసీ యువజన సంఘాలు సమన్వయం పాటించాలని, వలంటరీ సభ్యులకు, మహిళలకు ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. జాతర సమయంలో ఇసుక లారీల రవాణాను పూర్తిగా నిలిపివేయనున్నట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తులు ఏ విధంగా దర్శనం చేసుకోవాలనే అంశంపై ప్రత్యే క రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించామని అన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా జాతరకు ఏర్పాట్లు చేస్తున్నామని, అభివృద్ధిక శ్రీకారం చుట్టామని అన్నారు.

# కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్... ముగ్గురు ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్,జనవరి 07 :** జమ్మూకశ్మీర్ లోని కథువా జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు చుట్టుముట్టినట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఇద్దరు ముగ్గురు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్టు సమాచారం అందడంతో గాలింపు చర్యలు జరుపుతున్నట్టు అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో బిలావర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమద్ నల్లా సమీపంలో ఒక టెర్రరిస్టును స్థానికులు గుర్తించారు. ధన్ను పరోల్ వద్ద కూడా ఉదయం అతన్ని చూసినట్టు అధికారులకు సమాచారం అందింది. దీంతో అదనపు బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఎస్ఓజీతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్టు జమ్మూ ఐజీపీ భీమ్ సేన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఏడాది భద్రతా బలగాలు చేపట్టిన తొలి కీలక ఆపరేషన్ ఇదేనని, జమ్మూ ఐజీ, కథువా ఎస్ఎస్‌పీ శర్మ సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారని భద్రతా బలగాలు తెలిపాయి. ప్రస్తుతం ఎదురెదురు కాల్పులు కొనసాగుతున్నాయి.



# చైనా, రష్యాల, క్యూబాలతో దోస్తీ కట్ చేసుకో...

**వాషింగ్టన్,జనవరి 07 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో దఫా పాలనలో విదేశాంగ విధానం ద్వారా తన ఆకాంక్షలను తీర్చుకునే పనిలో పడ్డారు. రాత్రికి రాత్రి వెనెజువెలాపై కమాండో దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని, ఆయన భార్యను బందీలుగా అమెరికాకు తరలించి ట్రంప్ తన పంతం నెరవేర్చుకున్నారు. అంతటితో ఆగని ట్రంప్.. దక్షిణ అమెరికా దేశాన్ని మొత్తం తానే నియంత్రిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వానికి ట్రంప్ కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. వెనెజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. వెనెజువెలా చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే తాను పెట్టిన ఈ షరతులు పాటించాలని ట్రంప్ టీమ్ స్పష్టం చేసినట్లు ఏబీసీ న్యూస్ నివేదిక వెల్లడించింది. 'మొదట ఆ దేశం (వెనెజువెలా) చైనా, రష్యా, ఇరాన్, క్యూబాతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. రెండోది.. వెనెజువెలా చమురు ఉత్పత్తిలో అమెరికాతో ప్రత్యేక భాగస్వామిగా ఉండేందుకు, భారీ ముడి చమురు విక్రయాల్లో అమెరికాకు అనుకూలంగా ఉండేందుకు అంగీకరించాలి' అని ట్రంప్ టీమ్ షరతులు పెట్టినట్లు సదరు నివేదిక పేర్కొంది.

# ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

**న్యూఢిల్లీ,జనవరి 07 :**
పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లా డుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

# ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పరిశీలకులు

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమిం చింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్కి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. అస్సాం రాష్ట్రానికి మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బంధు తిర్కి ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా నియమితులయ్యారు. కేరళ పరిశీలకులుగా రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్, కేజే జార్జ్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, కన్హయ్య కుమార్ నియమితులయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి పరిశీలకులుగా ముకుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజీ మె?హమ్మద్ నిజాముద్దీన్ పరిశీలకులుగా ఉంటారు. పశ్చిమబెంగాల్‌కు సుదీప్ రాయ్ బర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్ పరిశీలకులుగా నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో పార్టీ వ్యూహాలను అమలు చేయడం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారానికి సమన్వయం చేయడంలో సీనియర్ పర్యవేక్షకులు కీలక పాత్ర పోషించనున్నారు.

# ఐ బొమ్మ రవికి కోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఇటీవల నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. ఈ బెయిల్ పిటిషన్లపై బుధవారం నాడు నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తాను హైదరాబాద్ వదిలి వెళ్లనని.. పోలీసు విచారణకు సహకరిస్తానని రవి కోర్టుకు తెలిపారు. ఇకపై పైరసీ చేయనని మొర పెట్టుకున్నాడు. మరోవైపు కేసు దర్యాప్తు దశలో ఉన్నదని పోలీసులు కోర్టుకు తెలిపారు. అలాగే ఇమ్మడి రవికిరవికి పలు దేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం ఐబొమ్మ రవి అభ్యర్థనను తోసిపుచ్చింది. ఐదు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది. ఆ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని ఆదరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన విలేకరుల తో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా జమ్మికుం ట, హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.కోటి వ్యయంతో ఆధునిక పరికరాలను సమకూర్చానని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు చర్యలు తీసుకుంటా మన్నారు. జమ్మికుంటలోని అంబేడ్కర్ కాలనీ, హౌసింగ్‌బోర్డ్ కాలనీ ముంపు ప్రాంతాలను కాపాడతానని, వరదకాలువ నిర్మాణాన్ని చేపడతామన్నారు.

# ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు కమిషన్‌లకు కక్కుర్తిపడి ప్రాజెక్టును పక్కనపెట్టారని మండిపడ్డారు. ఆ ముగ్గురు మంత్రులు ప్రజలకు మేలు చేయగల మొనగాళ్లు కాదని, మోసగాళ్లని కేటీఆర్ విమర్శించారు. వారు 30 శాతం చొప్పున కమిషన్‌లు వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప జిల్లాకు పనికొచ్చే పనులు ఒక్కటి కూడా చేయడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా చూపెట్టారని, ఇదిస్తాం.. అదిస్తాం అని నోటికొచ్చిన హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఏదీ ఇవ్వలేదని విమర్శించారు. అశ్వారావుపేటలో ఒక్క సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారా 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా కేసీఆర్ డిజైన్ చేశారని కేటీఆర్ చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, ఇల్లందు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు, కొత్తగూడెంలో 10 వేల ఎకరాలకు, వైరాలో 20 వేల ఎకరాలకు నీళ్లిచ్చేలా కేసీఆర్‌గారు సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేశారు. కానీ ఆ ప్రాజెక్టును ప్రభుత్వం పక్కనపెట్టింది. ఈ రెండేళ్లలో ప్రభుత్వం చేసింది ఏమైనా ఉందంటే.. అది ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలేనని, కేటీఆర్ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్, రాజ్యసభ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

# సిరిచేల్మ గ్రామన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం





**ఇచ్చోడా జనవరి, 07(డిడి9 వార్త న్యూస్)**
ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో పర్యటనలో భాగంగా గ్రామ పంచాయతీలో 52 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక సర్పంచ్ తో కలిసి పనులు ప్రారంభించారు ముఖ్యంగా స్కుల్ ప్రహరి గోడ నిర్మాణానికి 10 లక్షలు మరియు సీరిచేల్మ నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 22లక్షలు మరియు సి సి రోడ్లు 20 లక్షలు సీరిచేల్మ సర్పంచ్, ఉప సర్పంచ్ లతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేసి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ మాట్లాడుతూ సిరిచేల్మ గ్రామన్ని ఆదర్శంగాఈ తీర్చిదిద్దుకుందాం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి వారి సహకారం తో అదేవిధంగా జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వారి ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు కోమురం సత్యవతి కోటేశ్వర్,ఇచ్చోడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కళ్ళెం నారాయణ రెడ్డి, ఇచ్చోడ మండల మార్కెట్ ఉప అధ్యక్షులు షేశేరావు చౌహన్ సీరిచేల్మ సర్పంచ్ కాల రవిందర్,ఉప సర్పంచ్ అబ్దుల్ అజీమ్ సీరికోండ సర్పంచ్ దత్తు, ఉప సర్పంచ్ తోకల,మన్నపుర్ సర్పంచ్ భింరావు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి,యండి సద్దాం,మురళి గౌడ్,బత్తుల లక్ష్మణ్, ఇక్బాల్, సిద్దిక్,హాసన్ తదితరులు ఉన్నారు

# దత్తాత్రేయుని పల్లకితో కాలినడకన పాదయాత్ర








**బజార్ హత్నూర్, జనవరి 07 (డిడి9న్యూస్ ):-**
ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని దత్తాత్రే?యుని మందిరం నుంచి పల్లకిని భక్తులు వారి భుజాలపై ఎత్తుకొని పాద యాత్రగా ఈ నెల 4వ తేదీ నుంచి బయలు దేరింది. బుధవారం రోజు వరకు మండలకేంద్రంలోని దత్త దీక్ష పొందిన ఇళ్లలో రోజుకు కొన్ని ఇళ్లవద్దకు చేరగా భక్తులు ఇచ్చిన ఆథిత్యం, కానుకలు స్వీకరించి బుతాయిగ్రామంకువెళ్ళింది. పల్లకివెంటపలువురు భక్తులు భజనలు చేస్తూ దత్త నామస్మరణతో రోజుకొక ఊరిలో భక్తుల ఇళ్లకుచేరివారిచ్చిన ఆథిత్యాలు గైకొని ఈ నెల 16 వ తేదీన మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా మహూర్ దత్త మందిరంకు చేరుకొని అక్కడ కాకడ హారతికి అందుకుంటారు. అనంతరం బస్సులలో భక్తులు తిరిగి రావడం ప్రతీ ఏడాదిఆనవాహితీగావస్తోంది. భక్తులతో బజార్ హత్నూర్ దత్త మందిరం మహారాజ్ శ్రీ మనోహర్ గిరి వెన్నంటి ఉండి,దత్త మందిరం వద్దకు తీసుకొని వెళ్లి కాకడ హారతి, దైవ దర్శనంలు కావించడంతో పాదయాత్ర ముగుస్తుంది.

# పాఠశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తా

- పాఠశాలలో చదివే అందరూ నా బిడ్డలే
- ఏ సమస్య ఉన్న అండగా ఉంటా







**ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ, జనవరి 07(డిడి 9వార్త న్యూస్)**
నెరడిగొండ మండలంలోని కుంటాల గ్రామంలో గల ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంజూరు అయిన రూ. 10 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినిలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థిని మాట్లాడుతూ మా పాఠశాలకు అడిగిన వెంటనే సౌకర్యాలు కల్పించారని, ప్రోగ్రాంలకు స్టేజ్ లేదని కోరితే తక్షణమే స్టేజి నిర్మించారని, కోతుల బెడద ఎక్కువ ఉందని కోరితే తక్షణమే ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో చదివే బిడ్డలు నా బిడ్డలే అని పాఠశాలలో ఉన్న సమస్యలు అన్నీ తీర్చే బాధ్యత తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పన్ను ఎగవేత కేసులో ఆరెంజ్ సునీల్ రెడ్డి అరెస్ట్

- రూ. 28.24 కోట్ల పన్ను చెల్లించలేదని డీజీజీఐ అభియోగం
- అదనపు పన్ను కోసమే వేధిస్తున్నారని సునీల్ రెడ్డి వివరణ



**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, ఆరెంజ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ ఎండీ ముత్యాల సునీల్ రెడ్డిని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు అరెస్ట్ చేయడం జిల్లా రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. రూ. 28.24 కోట్ల మేర జీఎస్టీని వినియోగదారుల నుంచి వసూలు చేసి, ప్రభుత్వానికి జమ చేయలేదన్న ఆరోపణలపై జీఎస్టీ చట్టం 2017 ప్రకారం ఆయనను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన సునీల్ రెడ్డి, ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్నారు. అయితే, నియోజకవర్గంలో ముగ్గురు కార్పొరేషన్ ఛైర్మన్లు, సునీల్ రెడ్డి మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్న తరుణంలో ఈ అరెస్ట్ చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన వ్యతిరేక వర్గం సోషల్ మీడియాలో ఈ అరెస్ట్‌ను వైరల్ చేస్తుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. అదంతా అదనపు పన్ను వేధింపులే: సునీల్ రెడ్డితన అరెస్ట్‌పై సునీల్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాము ఏటా నిబంధనల ప్రకారం 5 శాతం జీఎస్టీ చెల్లిస్తున్నామని, అయితే అధికారులు దానిని 12 శాతానికి పెంచి అదనంగా రూ. 24 కోట్లు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై విచారణ జరుగుతోందని, రెండు మూడు రోజుల్లో అంతా సమసిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సేవలో ఉన్న తనపై జరుగుతున్న విచారణపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత తనపై ఉందని ఆయన పేర్కొన్నారు.

# అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సర్పంచ్ శీలం మహేందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు మరియు హాజరు పట్టికలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పాలు, గుడ్లు మరియు ఇతర పౌష్టికాహార పదార్థాలను లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆహారం నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, కేంద్రం పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్వైజర్ నందిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్, ఉప సర్పంచ్లకు సన్మానం చేసిన పాఠశాల ఉపాధ్యాయులు






**బజార్హత్నూర్, జనవరి, 07 (డిడి9న్యూస్):-**బజార్ హత్నూర్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రోజు కొత్తసర్పంచ్పర్చసాయన్న,ఉపసర్పంచ్_.శారదరాజన్నలకుప్రధానోపాధ్యాయులు జె. భూమన్న అధ్వర్యంలోఉపాధ్యాయులు ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న కొన్ని సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రదానంగా ఆర్ ఔబి రోడ్డు నుంచి తరగతి గదుల వరకు బి టీ రోడ్డు, పాఠశాల ముఖద్వారం ఏర్పాటు, కూలిన ప్రహరీని మరమ్మత్తు ఉన్నవని తెలపగా, సర్పంచ్ పిల్లలతో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారం అందించనున్నట్లుతెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు,సహాయఉపాధ్యాయబృందం,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాడాగూడ మాజీ సర్పంచ్ మడావి ప్రకాష్ మృతి



**బజార్ హత్నూర్, జనవరి 07(డిడి9వార్త):-** బజార్ హత్నూర్ మండలంలోని మాడాగూడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ ఐన మడావి ప్రకాష్ బుధవారం రోజు ఉదయం ఆయన మృతి చెందారు. బిజెపి పార్టీ కి మంచి కార్యకర్తగాఉన్న ఈయన మరణంతో అపార్టీకి, గ్రామస్తులకు శోకాన్ని నింపింది. పలువురు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

# ఉపాధ్యాయులపై వేధింపులు తగదు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
పాఠశాలల పర్యవేక్షణ పేరుతో ఎడపల్లి ఇన్‌ఛార్జి ఎంఈఓ శివలింగప్ప ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయడం తగదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ లు విమర్శించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఎంఈఓ తన పర్యటనల్లో సీఆర్‌పీలను వెంట వేసుకొని ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులపై పోలీసులకు ఫిర్యాదులు చేయడం వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. నిబంధనల పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే చర్యలను వెంటనే మానుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ



**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ చిన్నారులకు ఉచిత యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ బర్కం గంగాధర్, ఉపసర్పంచ్ లావణ్య ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చిన్నారుల విద్యాభివృద్ధికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలకు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల బలోపేతానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విగ్నేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పందిమడుగు అడవుల్లో చిరుత సంచారం

**- అటవీ ప్రాంతానికి వెళ్లొద్దని ఎఫ్ఆర్వో హెచ్చరిక**

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
సిరికొండ మండలంలోని పందిమడుగు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారం స్థానికంగా భయాందోళనలు రేత్తిస్తోంది. పందిమడుగు సెక్షన్ తిరుపతిగుట్ట బీట్ పరిధిలో ఒక ఆవుపై చిరుత దాడి చేసి చంపినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. అడవిలో ఏర్పాటు చేసిన_మెరా ట్రాప్‌లను పరిశీలించగా.. చిరుత సంచరిస్తున్న దృశ్యాలు నమోదయ్యాయని వారు ధ్రువీకరించారు. దాడికి గురైన ఆవు కళేబరానికి అధికారులు పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం అక్కడే పూడ్చిపెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో రవీందర్ మాట్లాడుతూ.. అటవీ పరిసర ప్రాంతాల ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని కోరారు. పంట పొలాల వద్ద కంచెలకు విద్యుత్ తీగలు అమర్చడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యల వల్ల వన్యప్రాణులకు ప్రాణాపాయం కలగడమే కాకుండా శిక్షర్హులవుతారని హెచ్చరించారు. గ్రామస్థులంతా జాగ్రత్తగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కేదారేశ్వర ఆశ్రమంలో గీతా శ్లోకాల పోటీలు

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** నందిపేట్ మండలంలోని కేదారేశ్వర ఆశ్రమం బుధవారం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. వెల్మల్ బాలాజీ సత్సంగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, భక్తులకు భగవద్గీత శ్లోకాల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, గీతా శ్లోకాలను స్పష్టమైన ఉచ్చారణతో పఠించి అలరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. నేటి యువతలో ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడం, భగవద్గీతలోని సారాంశాన్ని అందరికీ చేరవేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. చిన్నప్పటి నుంచే ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, వెల్మల్ బాలాజీ సత్సంగ్ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టీయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య రాంబాబు

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** తెలంగాణ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కళాశాల (ఆర్ట్స్ అండ్ సైన్స్) ప్రిన్సిపల్‌గా కామర్స్ విభాగం ఆచార్య రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి ఉత్తర్వులు జారీ చేశారు. వీసీ ఆచార్య యాదగిరి రావు ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఆచార్య రాంబాబుకు విశ్వవిద్యాలయంలో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన గతంలో కామర్స్ విభాగం అధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, కామర్స్ ఫ్యాకల్టీ డీన్‌గా, పరీక్షల విభాగంలో పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. తన నియామకంపై ఆచార్య రాంబాబు హర్షం వ్యక్తం చేస్తూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన వీసీ ఆచార్య యాదగిరి రావుకు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## కిసాన్ నగర్‌లో ఆక్యుప్రెషర్ వైద్య శిబిరం

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రాజస్థాన్‌కు చెందిన ప్రముఖ ఆక్యుప్రెషర్ వైద్య నిపుణులు పంకజ్ రాజ్‌పుత్, ధర్మేందర్, సునీల్ కుమార్ ఈ శిబిరంలో పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్స అందించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి కాలంలో మారుతున్న జీవనశైలి కారణంగా ఎదురవుతున్న కీళ్ల నొప్పులు, ఊబకాయం, పక్షవాతం, మానసిక ఒత్తిడి, తలనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలకు ఆక్యుప్రెషర్ పద్ధతిలో ఉపశమనం కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. మధుమేహం, రక్తపోటు, మెడ నొప్పితో బాధపడుతున్న వారికి ప్రత్యేక చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొన్నారు.

## ఐడీఏ జిల్లా అధ్యక్షుడిగా రఘు రావుట్ల ఎన్నిక




**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ప్రక్రియ ఉత్సాహంగా సాగింది. సంఘం జిల్లా అధ్యక్షుడిగా రఘు రావుట్ల ఎన్నికయ్యారు. నందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా సుగుణాకర్ రాజు, కోశాధికారిగా కార్తీక్ ఎంపికయ్యారు. వీరితో పాటు వైస్ ప్రెసిడెంట్లు, ఈసీ మెంబర్లను కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రఘు రావుట్ల మాట్లాడుతూ.. జిల్లాలోని దంత వైద్యుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ దంత వైద్య రంగంలో వస్తున్న మార్పులపై సభ్యులకు అవగాహన కల్పిస్తామని, జిల్లావ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దంత వైద్యులు ప్రతాప్, శ్రీనివాస్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** గ్రంథలయాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమని నిజామాబాద్ జిల్లా గ్రంథలయ సంస్థ ఛైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన రెంజల్ మండల కేంద్రంలోని శాఖా గ్రంథలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథలయంలోని రికార్డులను పరిశీలించి, పాఠకులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం గ్రంథలయ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో గ్రంథలయానికి నీటి సౌకర్యం లేని విషయాన్ని గ్రామస్థులు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఒక స్థానిక దాత, గ్రంథలయ ఆవరణలో సొంత ఖర్చులతో నూతన బోరు వేయించడానికి ముందుకు రావడం విశేషం. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నీటి సౌకర్యం కల్పిస్తున్నందుకు దాతను రాజారెడ్డి అభినందించారు. గ్రంథలయాల్లో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల మెటీరియల్‌తో పాటు అన్ని కనీస వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథలయ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# జనజీవన స్రవంతిలోకి మరో 26 మంది మావోయిస్టులు!



**హైదరాబాద్: జనవరి 07 (డిడి9వార్త ప్రతినిధి):-**
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సూక్మ జిల్లాలో మావోయిస్టు ఉద్యమానికి గట్టి దెబ్బ తగిలింది, జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్,ఎదుట బుధవారం మరో 26 మంది మావో యిస్టులు లొంగిపోయారు. మావోయిస్టుల కోటగా పిలవబడే బస్తర్ రీజియన్‌లో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది.జనజీవన స్రవంతిలోకి రావాలన్న ప్రభుత్వ పిలుపు మేరకు పోలీసుల పూన నర్కోమ్,కొత్త ఉదయం ప్రచార కార్యక్రమానికి ఆకర్షితులై వీరంతా ఆయు ధాలు వీడుతు న్నారు.కీలక నేతలు.. రూ. 64 లక్షల రివార్డు.లొంగి పోయిన వారిలో మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరి ప్రస్థానం పై ప్రభుత్వం గతంలోనే భారీ రివార్డులను ప్రకటించింది. లొంగిపోయిన 26 మందిపై కలిపి ప్రభు త్వం 64 లక్షల రూపాయల రివార్డును ప్రకటించింది. వీరంతా మావోయిస్టు పార్టీకి చెందిన మార్వార్ డివిజన్ మరియు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమిటీ సభ్యులుగా గుర్తించబడ్డారు. ఛత్తీస్‌గఢ్ పోలీసు యంత్రాంగం, సిఆర్పిఎఫ్ అధికారుల సమక్షంలో ఈ లొంగు బాటు ప్రక్రియ జరిగింది. మావోయిస్టు భావజాలం పట్ల విరక్తి చెంది, అభివృద్ధి వైపు మొగ్గు చూపుతూ వీరంతా లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ సహాయం అందించి, పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.ఇటీవలి కాలంలో ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత చర్యలు వేగవంతం కావడం, కీలక ఎన్‌కౌంటర్లు జరగడంతో దళసభ్యులలోఅభద్రతాభావం పెరిగి లొంగుబాట్లు కొనసాగుతు న్నాయి.

# బ్యాట్ పట్టిన ఏసీపీ.. మైదానంలో కేరింతలు

**- సాలూరలో ప్రీమియర్ లీగ్ సీజన్-5 ప్రారంభం**
**- క్రీడలతోనే శారీరక దృఢత్వం : ఏసీపీ శ్రీనివాస్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా నిలిచే సాలూర ప్రీమియర్ లీగ్ సీజన్-5 క్రికెట్ పండుగ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా బ్యాట్ పట్టి మైదానంలోకి దిగి అలరించారు. ఏసీపీ బ్యాటింగ్ చేస్తుంటే యువత కేరింతలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. యువత నిరంతరం క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవాలని సూచించారు. గ్రామీణ స్థాయిలోనే ప్రతిభను చాటి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. టోర్నీ నిర్వహిస్తున్న అల్లే జనార్ధన్, యువతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య రవి, ఉప సర్పంచ్ సురేష్ పటేల్, తహసీల్దార్ శశి భూషణ్, ఎంపిడివో శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి బస్వంత్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లే రమేష్, గంగా శంకర్, వార్డు సభ్యులు, గ్రామాల యువత, క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల వేధింపుల నిరోధానికి టోల్ ఫ్రీ నంబర్ : సీపీ సాయి చైతన్య వెల్లడి

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. బుధవారం నగరంలో నిర్వహించిన డాక్టర్ లూయి బ్రెయిలీ 217వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపి మాట్లాడుతూ.. ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న దివ్యాంగులు పలు రకాల వేధింపులకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారిని రక్షించేందుకు మరియు వారికి తక్షణ సహాయం అందించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. దివ్యాంగుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని, బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. చదువుకోవాలనే తపన ఉన్నా చూపు లేక ఇబ్బంది పడే అంధుల కోసం బ్రెయిలీ లిపిని కనుగొని, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయి బ్రెయిలీ అని సిపి కొనియాడారు. ఆయన పట్టుదల, సేవా నిరతి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దివ్యాంగులు ఆత్మన్యూనతా భావానికి లోనుకాకుండా, సమాజంలో అందరితో సమానంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# అతిథి అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :**
నిజామాబాద్ నగరంలోని చారిత్రాత్మక గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యా ప్రమాణాలు, వసతులను ఆయన పరిశీలించారు. అనంతరం కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకులు ఛైర్మన్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి విధుల్లో కొనసాగుతున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వెంటనే ఎం.టి.ఎస్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యాపకుల విన్నపంపై ఛైర్మన్ బాలకిష్టారెడ్డి సానుకూలంగా స్పందించారు. అతిథి అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తమకు పూర్తి అవగాహన ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో అధ్యాపకులు నిరంతరం శ్రమించాలని ఆయన సూచించారు.



## అప్పుల్లో ఉన్నా హామీలు నెరవేరుస్తున్నాం : రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** ప్రభుత్వం పేదల సంక్షమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ధర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాలకు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల పాలు చేసినప్పటికీ, తాము అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదల సంక్షమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల , లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లా జైలర్‌పై సస్పెన్షన్ వేటు


**- గంజాయి కలకలం.. ఖైదీలపై దాడి ఆరోపణలు**

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లా సారంగాపూర్ జైలులో కలకలం రేగుతోంది. జైలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై జైళ్ల శాఖ కఠిన చర్యలు చేపట్టింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన జిల్లా జైలర్ ఉపేందర్‌ను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో జైలర్ సాయి సురేశ్‌ను ఆదిలాబాద్ జైలుకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. గత కొద్దిరోజులుగా సారంగాపూర్ జైలులో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నాయనే తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఉన్నతాధికారులు రహస్య విచారణ చేపట్టారు. జైలు లోపలికి నిషిద్ధ పదార్థాలు ఎలా వస్తున్నాయనే అంశంపై అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపించడంతో ఈ వేటు పడినట్లు తెలుస్తోంది. వారం క్రితం జైలులో శిక్ష అనుభవిస్తున్న చాకలి రాజు, కర్నే లింగం అనే ఇద్దరు ఖైదీలు తాము ఎదుర్కొంటున్న వేధింపులను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. జైలర్లు తమను దారుణంగా కొట్టారని వారు ఫిర్యాదు చేయడంతో విషయం తీవ్రమైంది. దీనిపై జైళ్ల శాఖ అధికారులు జైలుకు వచ్చి విచారణ జరిపి డీజీకి నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగానే బాధ్యులపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. జైలర్ ఉపేందర్ సస్పెన్షన్ నేపథ్యంలో, వరంగల్ జైలర్ పూర్ణచందర్‌కు నిజామాబాద్ జిల్లా జైలు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. జైలులో క్రమశిక్షణ ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు.

## సిరికొండ పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారి

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** సిరికొండ మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రాన్ని జిల్లా పశువైద్యాధికారి డా.గంగాధరయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేయడంతో పాటు మందుల నిల్వలను పరిశీలించారు. రైతులకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ రోజు (గురువారం) నుంచి ఈ నెల 22 వరకు మండల వ్యాప్తంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేపడుతున్నట్లు ప్రకటించారు. మండలంలోని 66 శాతం గొర్రెలకు, 33 శాతం మేకలకు ఈ విడతలో మందులు అందజేస్తామన్నారు. పశుపోషకులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ జీవాలను రక్షించుకోవాలని సూచించారు. మండల పరిధిలో చిరుత పులి దాడిలో మృతి చెందిన ఆవు ఘటనపై ఆయన ఆరా తీశారు. ఆవుకు నిర్వహించిన పోస్టుమార్టం నివేదిక వివరాలను స్థానిక పశువైద్యాధికారి డా. అభిషేక్‌ను అడిగి తెలుసుకున్నారు. అడవి జంతువుల సంచారం ఉన్న దృష్ట్యా పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

## మున్సిపల్ ఎన్నికలకు శరవేగంగా ఏర్పాట్లు




**ఖమ్మం రూరల్, 07 :** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 32 వార్డులు ఉండగా వాటి పరిధిలో 69 పోలింగ్ బూత్‌లఅబశ్రీశ్రీను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే డ్రాఫ్ట్ రోల్ ఓటర్ల జాబితా సిద్ధం చేసిన అధికారులు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను సైతం స్వీకఅబశ్రీశ్రీరించారు. ఒకవైపు ఓటరు తుది జాబితా రూపొందించే పనిలో ఉన్న మున్సిపల్ అధికారులు మరోవైపు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్ల రూట్ మ్యాప్, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన నిర్వహణ సిబ్బంది, అధికారుల నియామక ప్రక్రియలో పూర్తిగా నిమగ్నమయ్యారు. గతంలో మున్సిపాలిటీ ఏర్పాటు కాకముందు మొత్తం 65 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈ దఫా ఎన్నికల్లో అదనంగా మరో నాలుగు పోలింగ్ బూత్‌లఅబశ్రీశ్రీను ఈఎంసీ అధికారులు గుర్తించారు. ప్రతి 600 మంది ఓటర్లకు ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో మొత్తం 69 పోలింగ్ బూత్‌లఅబశ్రీశ్రీను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో పోలింగ్ బూతుల ఏర్పాటుకు సంబంధించి అధికారికంగా ప్రకటించనున్నారు.

## పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీకాంత్ రెడ్డి బదిలీ

**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్ఓ)గా నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాంత్ రెడ్డి బదిలీ కావడంతో, ప్రస్తుతం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా ఉన్న అరవింద్ రెడ్డికి జిల్లా మేనేజర్‌అబశ్రీశ్రీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. శ్రీకాంత్ రెడ్డి తన హయాంలో జిల్లాలో ధాన్యం సేకరణ, పంపిణీ ప్రక్రియలో చురుగ్గా వ్యవహరించారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు బుధవారం జిల్లా కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన అందించిన సేవలను సహోద్యోగులు కొనియాడారు. అనంతరం అరవింద్ రెడ్డి జిల్లా మేనేజర్‌అబశ్రీశ్రీగా బాధ్యతలు స్వీకరించారు.

## జానకంపేట్ లో కారును ఢీకొన్న ఇసుక టిప్పర్


**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** ఎడపల్లి మండలం జానకంపేట్ వద్ద బుధవారం పెను ప్రమాదం తప్పింది. గాంధీ చౌరస్తా సమీపంలో అధిక లోడుతో వెళ్తున్న ఓ ఇసుక టిప్పర్ బీభత్సం సృష్టించింది. నవీపేట వైపు నుంచి వస్తున్న కారును టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న వారికీ స్వల్ప గాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి కారణమైన ఇసుక టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతి వేగం, పరిమితికి మించిన లోడుతో వాహనాలు నడపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు.

## రోడ్డు నిబంధనలు పాటిస్తేనే భద్రత



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** రహదారి నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణతో కూడిన ప్రయాణమే ప్రాణాలకు రక్షణ అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం బోధన్ మండలం ఆమ్దాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు రహదారి దాటే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల బారి నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చని ఆయన వివరించారు. నిబంధనల ఉల్లంఘన వల్ల కలిగే అనర్థాలను, రోడ్డు భద్రతా చట్టాల ప్రాముఖ్యతను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకుంటే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ




**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం మైనారిటీ పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ బుధవారం సందర్శించారు. స్థానిక తహసీల్దార్‌తో కలిసి వెళ్లిన ఆయన, పాఠశాలలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, భోజన వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని అధికారులను ఆదేశించారు. పాఠశాల నిర్వహణకు సంబంధించి చట్టబద్ధ రిజిస్టర్లను, విద్యార్థుల హాజరు పట్టికలను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో ఉన్న కిరాణా సరుకుల నాణ్యతను పరిశీలించి, నిల్వల రికార్డులతో సరిపోల్చారు. విద్యా కార్యకలాపాలు, విద్యార్థుల సంక్షమ కార్యక్రమాల అమలు తీరుపై సిబ్బందితో చర్చించి పలు సూచనలు చేశారు. పాఠశాల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి తహసీల్దార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణా ఈగల్ టీమ్ పంజా అంతర్రాష్ట్ర డ్రగ్స్ స్మగ్లర్ అరెస్ట్.

పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో అంతర్రాష్ట్ర డ్రగ్స్ సరఫరాదారుడిని తెలంగాణా ఈగల్ టీమ్ అదుపులోకి తీసుకుంది. నిందితుడి వద్ద నుంచి రూ.1.5లక్షలు విలువ చేసే 200 గ్రాముల ఎండీఎంఏ, 60గ్రా ఓపీఎం డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈగల్ టీమ్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన వారిపై నిఘా పెట్టింది.తెలంగాణ ఈగల్ టీమ్ రాజస్థాన్ వెళ్లి వస్తూ డ్రగ్స్ తీసుకొస్తున్న నిందితుడు రాజేందర్‌ను పక్కా సమాచారంతో పేట్‌బషీరాబాద్ పోలీసులతో కలిసి పట్టుకుంది. నిందితుడి నుంచి 10మంది డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ డ్రగ్స్ వ్యవహారానికి సంబంధించి మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు



**కమ్మర్‌పల్లి, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** సంక్రాంతి పండుగ వేళ ప్రమాదకరమైన చైనా మాంజాను విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు కిరాణ, జనరల్ స్టోర్లలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణదారులకు చైనా మాంజా విక్రయాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎస్సై మాట్లాడుతూ.. చైనా మాంజా వల్ల వాహనదారులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాగే పక్షులు, జంతువులకు కూడా ఇది ప్రాణాపాయంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా చైనా మాంజాను నిల్వ ఉంచినా లేదా విక్రయించినా భారీ జరిమానాలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గాలిపటాలు ఎగురవేసే వారు కేవలం సాధారణ నూలు దారాలనే వాడాలని, పర్యావరణానికి మరియు ప్రాణాలకు ముప్పు కలిగించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బాధితులకు పోగొట్టుకున్న ఫోన్ల అందజేత




**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** వివిధ సందర్భాల్లో ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ఆర్మూర్ పోలీసులు రికవరీ చేసి బుధవారం బాధితులకు అందజేశారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్ల గురించి బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు, సీఈఐఆర్ పోర్టల్ సాంకేతికతను ఉపయోగించి వాటి ఆచూకీ కనుగొన్నారు. ఈ మేరకు రికవరీ చేసిన ఫోన్లను ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్ బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే 'మీ సేవ' ద్వారా లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అలాగే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తే ఫోన్ రికవరీ చేయడం సులభమవుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఫోన్లను తిరిగి తెచ్చినందుకు పోలీసులకు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ సుదర్శన్ గౌడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిద్దాం ప్రమాదాలు నివారిద్దాం : జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వర్




**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వర్ అన్నారు. బుధవారం నవీపేట్ మండల కేంద్రంలో రోడ్డు భద్రతా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై చిన్నతనం నుంచే విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారి కిరణ్ కుమార్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్, రవాణా మరియు పోలీస్ శాఖల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజ వికాసం : ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి




**నిజామాబాద్ జిల్లా జనవరి 07(డీడీ9 వార్త) :** సమాజాన్ని ఉన్నతీకరించడంలో విద్యదే కీలక పాత్ర అని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వసతులు, బోధనా పద్ధతులను పరిశీలించి, అధ్యాపకులతో సమావేశమయ్యారు. జాతీయ విద్యా విధానం ఆధారంగా విద్యలో గుణాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా డిగ్రీ, పీజీ పాఠ్య ప్రణాళికల్లో మార్పులు చేపడుతున్నట్లు ఛైర్మన్ తెలిపారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు రీసెర్చ్ అవార్డ్స్, లెర్నింగ్ మెటీరియల్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ వంటి నూతన అంశాలను రూపొందించి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. అధ్యాపకులు మరింత కృషి చేసి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగరత్నం, పీఆర్వో దండు స్వామి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ రామస్వామి, అధ్యాపకులు రంజిత, వినయ్, ముత్తెన్న, చంద్రశేఖర్, రామకృష్ణ, జయ ప్రసాద్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'మన శంకరవరప్రసాద్ గారు' సందడి షురూ..

## భారీ ధరకు తొలి టిక్కెట్ కొన్న అభిమాని

మెగాస్టార్ చిరంజీవి తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. హిట్ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించారు. సినిమా విడుదలకు కొన్ని రోజులే ఉండటంతో ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. చాలా చోట్ల టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి.

ఈ క్రమంలో, కోనసీమ జిల్లా అమలాపురంలోని వెంకటరమణ థియేటర్‌లో జరిగిన ఒక ప్రత్యేక ఈవెంట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. చిరంజీవి యువత అభిమాన సంఘం ఆధ్వర్యంలో ప్రీమియర్ షో మొదటి టికెట్ కోసం వేలం నిర్వహించారు. ఈ వేలంలో మెగా అభిమాని, జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బారావు పాల్గొని, ప్రీమియర్ షో మొదటి టికెట్‌ను ఏకంగా 1.11 లక్షల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వచ్చిన మొత్తాన్ని చిరంజీవి చారిటబుల్ ట్రస్టుకు అందజేస్తామని అభిమాన సంఘం నాయకులు తెలిపారు. తనకు తొలి టికెట్ దక్కడంపై సుబ్బారావు సంతోషం వ్యక్తం చేశారు.

ఇక సినిమా విషయానికి వస్తే, చిరంజీవి ఉ అనిల్ రావిపూడి కాంబినేషన్ కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రోమోలు, పాటలు,



ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. సినిమాపై హైప్ రోజురోజుకూ పెరిగిపోతోంది. సినిమాకి సెన్సార్ నుంచి యూ/ఏ సర్టిఫికెట్ దక్కింది. మొత్తం నిడివి 2 గంటల 42 నిమిషాలు. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేశ్ ఒక గెస్ట్ రోల్‌లో కనిపించనున్నారు.

సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మాణంలో తెరక్కిన ఈ సినిమాకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ రోజు సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్ జరగనుండటంతో ఇప్పటికే అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

### సంక్రాంతి సినిమాల నిర్మాతలకు

# హైకోర్టులో ఊరట

## టికెట్ రేట్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశం

**'రాజాసాబ్, 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రాలకు మేలు**

**సింగిల్ బెంచ్ తీర్పు ఈ చిత్రాలకు వర్తించదని స్పష్టం చేసిన కోర్టు**



సంక్రాంతి బరిలో నిలిచిన 'ది రాజాసాబ్, 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రాల నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ రేట్ల పెంపుదలపై నిర్మాతలు చేసుకున్న వినతిని పరిశీలించి, నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శిని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది.ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'ది రాజాసాబ్ జనవరి 9న, చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో టికెట్ రేట్ల పెంపు, ప్రత్యేక షోల కోసం నిర్మాతలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని, హైకోర్టును ఆశ్రయించారు.

దీనిపై విచారణ జరిపిన డివిజన్ బెంచ్, టికెట్ రేట్ల పెంపును నిరాకరిస్తూ గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు 'పుష్ప-2', 'ఓజీ', 'అఖండఅబశ్రీశ్రీ2', 'గేమ్ ఛేంజఅబశ్రీశ్రీర్' వంటి చిత్రాలకు మాత్రమే వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఈ రెండు సంక్రాంతి చిత్రాలకు ఆ తీర్పు వర్తించదని తేల్చిచెప్పడంతో నిర్మాతలకు ఊరఅబశ్రీశ్రీట లఅబశ్రీశ్రీభించినఅబశ్రీశ్రీట్టైంది.

# మా ఇంటి బంగారంతో సమంత




సమంత అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దర్శకురాలు మినహా ఇప్పటివరకూ ఎవరూ ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను సామ్ షేర్ చేశారు. ఈ సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్న సమంత .. ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. 'మీరు చూస్తా ఉండండి..

మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది అంటూ రాశారు. జనవరి 9న ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో అభిమానులు సంబర పడుతున్నారు. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అని కామెంట్స్ చేస్తున్నారు.

'ఓ బేబీ' తర్వాత సమంత దర్శకురాలు నందిని రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. గతేడాది అక్టోబర్ 2న దీని షూటింగ్‌ను ప్రారంభించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు. దీనితో పాటు సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.

-------

# శీతాకాలంలో గ్లామర్ తో హీట్ పుట్టిస్తున్న నభా నటేష్!

కార్తికేయ 2 సినిమాతో భారీ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న నిఖిల్ సిద్ధార్థ్ ఆ తర్వాత అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రం చేసి ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేదు. ఆ తర్వాత స్వయంభు మూవీని ప్రకటించారు. వాస్తవానికి గత ఏడాది ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల విడుదలకు నోచుకోలేదు. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా వస్తున్న ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్త మీనన్ తో పాటు ప్రముఖ బ్యూటీ నభా నటేష్ కూడా హీరోయిన్గా నటిస్తోంది. 2026 ఫిబ్రవరి 13న విడుదల కాబోతోంది. తెలుగు , తమిళ్ , కన్నడ, హిందీ, మలయాళం భాషల్లో విడుదల కానున్న నేపథ్యంలో అటు టీజర్లు, మేకింగ్ వీడియోలు ఇప్పటికే యూట్యూబ్లో అందుబాటులోకి వచ్చి ఆడియన్స్ కి సినిమాపై అంచనాలు పెంచేసాయి. ఇందులో నిఖిల్ ఒక యోధుడిగా కనిపిస్తున్నారు. ఇటు విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో అటు నభా నటేష్ కూడా సోషల్ మీడియా వేదికగా గ్లామర్ ను వలకబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకోవడమే కాకుండా తన సినిమాపై అంచనాలు పెంచే ప్రయత్నం చేస్తోంది అని నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా శీతాకాలంలో హీట్ పుట్టిస్తూ అందాలను ఆరబోస్తూ ఫోటోలు షేర్ చేసింది ఈ ముద్దుగుమ్మ తాజాగా నభా నటేష్ షేర్ చేసిన ఫోటోలలో బ్లేజర్ ధరించిన ఈమె గమ్ బూట్స్ తో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. కారులో స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులిస్తూ.. తన ఫేస్ ఎక్స్ప్రెషన్స్ తో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ ఫోటోలకు ఫాలోవర్స్ పిచ్చెక్కిపోతున్నారు. ముఖ్యంగా హార్ట్, ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ ఆమెపై తమకున్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. చాలా రోజుల తర్వాత గ్లామర్ వలకబోస్తూ షేర్ చేసిన ఫోటోలకి కొంతమంది వింటేజ్ వైబ్స్ అని కామెంట్లు చేస్తే.. మరి కొంతమంది లేడీ సూపర్ స్టార్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇలా ఎవరికి వారు తమ అభిప్రాయాలను కామెంట్ రూపంలో తెలియజేస్తూ కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. మొత్తానికి నభా నటేష్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ హల్చల్ చేస్తున్నాయి.



# మరో అద్భుతానికి తెరలేపనున్న రిషబ్‌శెట్టి!

కాంతార- మూవీతో సైలెంట్‌గా బరిలోకి దిగి కన్నడతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, హిందీ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచిన హీరో రిషబ్ శెట్టి. విలన్‌గా కెరీర్ ప్రారంభించిన రిషబ్ అనూహ్యంగా -కాంతార- మూవీతో పాన్ ఇండియా స్టార్‌ల జాబితాలో చేరిన విషయం తెలిసిందే. కేవలం మౌత్ టాక్‌తో ఐదు భాషల్లోనూ ఈ సినిమాతో సంచలన విజయాన్ని సొంత చేసుకున్నాడు. హీరోగా, దర్శకుడిగా ప్రశంసలు, జాతీయ స్థాయిలో అవార్డుల్ని సైతం దక్కించుకుని కన్నడ నాట మోస్ట్ వాంటెడ్ స్టార్‌గా మారాడు. ఫస్ట్ మూవీగా మరో ఘనత గత ఏడాది దీనికి ప్రీక్వెల్‌గా రూపొందిన -కాంతార చాప్టర్ 1-తోనూ అంతకు మించిన బ్లాక్ బస్టర్‌ని సొంతం చేసుకుని దేశ వ్యాప్తంగా ప్రేక్షకులతో పాటు మేకర్స్‌ని ఆశ్చర్యపరిచాడు. ప్రస్తుతం పాన్ ఇండియా సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తున్న రిషబ్ శెట్టి ..ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న -జై హనుమాన్-లో టైటిల్ క్యారెక్టర్ పోషిస్తున్నాడు. ఇందులో లార్డ్ హనుమాన్‌గా కనిపించి సర్‌ప్రైజ్ చేయబోతున్నాడు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈగశ్రీంశీ =ఘ్రుం - రహస్యంగా నిశ్చితార్థం.. పెళ్లి మాత్రం ధూమ్ ధామ్.. ఇక హిందీలో -ది ప్రైడ్ ఆఫ్ భారత్ ఛత్రపతి మహారాజ్-తో పాటు మరో రెండు మూడు క్రేజీ ప్రాజెక్ట్‌లకు రెడీ అవుతున్నాడు. అయితే -కాంతార-తో అద్భుతాన్ని సృష్టించిన రిషబ్‌శెట్టి త్వరలో మరో అద్భుతానికి తెరలేపనున్నాడని తెలుస్తోంది. మలయాళ ఫేమస్ రచయిత, స్క్రీన్‌ప్లే రైటర్ ఎంటీ. వాసుదేవన్ నాయర్ రచించిన పాపులర్ నవల -రండమూళం- ఆధారంగా సినిమా చేయడానికి రెడీ అవుతున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. -రంగమూళం- మహాభారతాన్ని ఆధారం చేసుకుని భీముని నేపథ్యంలో సాగుతుంది దీంతో ఇదే కథని తెరపైకి తీసుకురావాలనే ప్లాన్‌లో రిషబ్ ఉన్నట్టుగా ఇన్ సైడ్ టాక్ వినిపిస్తోంది.



# వాలంటైన్స్ డే రోజు కపుల్ ఫ్రెండ్లీ మూవీ రిలీజ్

టాలీవుడ్ యాక్టర్ సంతోష్ శోభన్ హీరో గా నటిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్‌బ్యానర్‌పై తెరకెక్కుతోంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ మూవీని వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. సన్‌లైట్‌లో హీరోహీరోయిన్లు రొమాంటిక్ మూడ్‌లో ఉన్న లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి అజయ్ కుమార్ రాజు పీ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన టీజర్ మిడిల్ క్లాస్ కష్టాల నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. టీజర్‌లో నెల్లూరు కుర్రాడైన శివ (సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేస్తూ, సరైన ఉద్యోగం లేక చెన్నైలో కష్టాలు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్(రాపిడో లాంటివి) చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ప్రీతి (మానస వారణాసి) అతని బైక్‌లో ప్రయాణిస్తుంది

